సాక్షి
అనంతపురం

సోమవారం । 17 । జూన్ । 2024



నేడు బక్రీద్

జిల్లాలో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ప్రార్థనలకు ఈద్గాలను సిద్ధం చేశారు.



భార్య గొంతుకోసిన భర్త

భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమె గొంతు కోశాడు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

8లో

గరిష్టం/కనిష్టం
36.7°/23.5°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బక్రీద్ సుఖసంతోషాలతో జరుపుకోవాలి



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు, సోదరీమణులు ప్రశాంత వాతావరణంలో సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అల్లా దయతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆనందంగా జీవనం గడపాలని ఆకాంక్షించారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



టీబీ డ్యాం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం ఉదయానికి జలాశయంలో 6.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,619 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. అవుట్‌ఫ్లో 577 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1583.03 అడుగులకు చేరుకుంది. డ్యాం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.110 టీఎంసీల నీరు ఉంది. డ్యాం ఎగువ భాగాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1,580.94 అడుగుల వద్ద 4.940 టీఎంసీల నీరు నిల్వ ఉండిందని పేర్కొన్నారు.

కేంద్ర బృందం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: 'ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (కేంద్ర బృందం) ఈనెల 18 నుంచి 21 వరకు జిల్లాలో పర్యటించనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి' అని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర బృందం పర్యటనపై జేసీ ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్‌ఓ జి. రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 రబీ సీజన్‌లో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం పరిశీలిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయి సమావేశం కూడా ఇక్కడే నిర్వహించనున్నారని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డీపీఎం ఆనంద్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ప్రజారోగ్య శాఖ ఈఈ సతీష్‌రెడ్డి, తహసీల్దారు శివరామిరెడ్డి, ఏడీఏలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే ఫైలు ముందుకు!

- అవినీతి అడ్డాగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం
- ప్రతి ఫైలుకూ రేటు ఫిక్స్ చేసిన అధికారి
- ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై భారీగా వసూళ్లు
- మలేరియా సిబ్బంది డిప్యుటేషన్లలోనూ చేతివాటం
- దోమతెర రవాణా బిల్లులు పెట్టినందుకూ మామూళ్లే
- ఆవేదనలో బాధిత ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల వరకూ పాలనా పరంగా సజావుగా నడిపించాల్సిన అధికారులు డబ్బు కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బు ఇవ్వనిదే ఏ ఫైలునూ పరిష్కరించడం లేదని తెలిసింది. చివరకు డిప్యుటేషన్‌కు రూ.లక్ష లెక్కన వసూలు చేసి డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని అవినీతి కూపంగా మార్చారని సమాచారం. ఈ క్రమంలో ఉన్నతాధికారి తీరుపై పలువురు ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు.

పనిలేని కొలువు.. రూ.లక్షల్లో ముడుపులు..

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మలేరియా విభాగంలో చాలామంది పనిచేస్తున్నారు. మలేరియా, డెంగీ కేసుల నియంత్రణలో వీరు కీలక పాత్ర పోషించాల్సి ఉంది. కానీ అక్కడ విధులు నిర్వర్తించకుండా డిప్యుటేషన్‌పై కొందరు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ కార్యాలయంలో ఏ మాత్రమూ పని లేకుండా ఆరుగురు సిబ్బంది ఉన్నారు. వీరిని ఇక్కడికి డిప్యుటేషన్‌పై తీసుకోవడానికి ఒక్కొక్కరి నుంచి రూ. లక్ష నుంచి లక్షన్నర వరకూ వసూలు చేసినట్టు తెలిసింది. ఓ వైపు వర్షాలు కురుస్తూ పల్లెల్లో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలుతున్నా అక్కడ సిబ్బంది లేక ఇబ్బంది పడుతుంటే ఇక్కడేమో ఖాళీగా ఉంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుత్తి, ఉరవకొండ, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వీరు కొన్ని నెలలుగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలోనే ఉంటున్నారు.

డబ్బు లేనిదే ఏ ఫైలూ కదలదు..

డీఎంహెచ్‌ఓ కార్యాలయం అంటేనే ఉద్యోగులు భయపడుతున్నారు.ఎప్పుడో దోమ తెరలు రవాణా చేసినందుకైన వ్యయానికి సంబంధించి ఉద్యోగులు బిల్లు పెడితే దీనికి కూడా ఉన్నతాధికారి కమీషన్లు అడిగారని ఓ చిరుద్యోగి వాపోయారు. మొత్తం బిల్లులో 10 శాతం ఇస్తే గానీ ఫైలుపై సంతకం చేయలేదని ఆరోపించారు. మలేరియా విభాగంలో విధులు నిర్వర్తించాల్సిన ఎంపీహెచ్‌ఏలు వివిధ ప్రాంతాల్లో ఉన్నారు. వీళ్ల జిల్లా కేంద్రంలో ఉంటూ శాంపిల్ కలెక్షన్ చేయాలి. కానీ వీళ్లను ఇక్కడకు తేవడానికి భారీ మొత్తంలో డబ్బు అడుగుతున్నట్టు తెలిసింది. డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ఫైలు వచ్చిందంటే డబ్బు ఇవ్వనిదే పని జరగడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలే లేవు..

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏదైనా తప్పు జరిగిందంటే డీఎంహెచ్ కార్యాలయానికి పండగలా మారుతోంది. కాన్పులు వికటించి బాలింత మృతి చెందిన సందర్భంలో బాధితులు ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యంపై గొడవకు దిగితే రంగంలోకి దిగి వారికి న్యాయం చేయాల్సిన అధికారులు ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నో కేసుల్లో కనీస జరిమానా కూడా విధించకుండా ఆస్పత్రి యాజమాన్యాలతో డబ్బు తీసుకుని వదిలేసిన ఘటనలు ఉన్నాయి. అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిన గర్భస్థ లింగనిర్ధారణ చట్టం కూడా అధికారుల లాలూచీతో జిల్లాలో అభాసుపాలవుతోంది.అధికారుల చర్యలు నామమాత్రంగా ఉండటంతో తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ప్రైవేటు నర్సింగ్ హోంలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

> **బిల్లులకు డబ్బు అడగలేదు**
>
> నేను ఎలాంటి బిల్లులకూ డబ్బు అడగలేదు. నా టేబుల్‌పైకి ఏ ఫైలు వచ్చినా వెంటనే సంతకం పెట్టేస్తాను. డిప్యుటేషన్ల విషయం నాకు తెలియదు. ఒకసారి పరిశీలిస్తా.
>
> – భ్రమరాంబా దేవి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

అరటి మాటున గోవా మద్యం రవాణా

- గుట్టు రట్టు చేసిన సెబ్ పోలీసులు



పట్టుబడిన అక్రమ మద్యం బాక్సులతో సెబ్ పోలీసులు

ఉరవకొండ: అరటి కాయల మాటున గోవా మద్యాన్ని తీసుకెళ్తున్న ఓ వ్యక్తి గుట్టును సెబ్ పోలీసులు రట్టు చేశారు. ఉరవకొండ సెబ్ సీఐ కార్యాలయ ఆవరణలో సెబ్ డీఎస్పీ శ్రీరామ్, ఉరవకొండ సెబ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ నాయక్ వెల్లడించిన మేరకు... విశ్వసనీయ వర్గాల సమాచారంతో శనివారం అర్ధరాత్రి విడపనకల్లు మండలం కరకముక్కల క్రాస్ వద్ద సెబ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఓ బొలేరో వాహనాన్ని పరిశీలించగా, ఖాళీ అరటి కాయల బాక్సుల కింద గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాక్సులు పట్టుబడ్డాయి. కర్నూలుకు చెందిన కృష్ణగౌడ్ తీసుకెళ్తున్నట్లు వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి బొలేరోతో పాటు 1,920 ఎంహెచ్ క్వాటర్ బాటిళ్లు, 240 రాయల్‌స్టాగ్, 180 ఎంహెచ్, 60 బ్లూ ఓషియన్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవా రాష్ట్రంలోని ధరల ప్రకారం పట్టుబడ్డ మద్యం విలువ రూ 3.10 లక్షలు ఉంటుందని, ఏపీలో మద్యం ధరల ప్రకారం రూ.10 లక్షలు పలుకుతుందని సెబ్ పోలీసులు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే ఉపేక్షించమని స్పష్టం చేశారు. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉరవకొండ సెబ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ హేమంత్‌కుమార్, కానిస్టేబుళ్లు జాన్‌పాల్, వాసు, శివయ్య తదితరులను డీఎస్పీ శ్రీరామ్ ప్రత్యేకంగా అభినందించారు.

చేప పిల్లల పెంపకానికి సన్నాహాలు



చేప పిల్లలు



బీటీపీ మత్స్యక్షేత్రంలో చేప పిల్లల పెంపకానికి సిద్ధం చేసిన నీటి తొట్టెలు

- జిల్లాలో 8 కోట్ల విత్తన చేప ఉత్పత్తి లక్ష్యం
- మత్స్యశాఖ అధికారుల చర్యలు

రాయదుర్గం: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో చేప పిల్లల పెంపకానికి మత్స్యశాఖ సన్నాహాలు ప్రారంభించింది. చేపల పెంపకానికి అనువైన చెరువులు జిల్లాలో 130 ఉండగా, అందులో 50 నుంచి 60 చెరువుల్లో సమృద్ధిగా నీరు చేరనున్నాయి. ఇక్కడ వంద శాతం ఉత్పత్తి సాధిస్తారు. వీటికి తోడు జిల్లాలోని బీటీపీ, పీఏబీఆర్, చాగల్లు, ఎంపీ డ్యాం, పెండేకల్లు తదితర చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో లైసెన్స్ కలిగిన రిజర్వాయర్లు బీటీపీ, పీఏబీఆర్ మాత్రమే కాగా, ఇక్కడ మత్స్యశాఖ ఆధ్వర్యంలోనే వంద శాతం (ఉచితంగా) రాయితీతో చేపలు విడుదల చేస్తారు. మిగిలిన రిజర్వాయర్లలో సొసైటీ లీజుదారులు కొనుగోలు చేసి పెంచుతారు.

మత్స్య సంఘాలకు రాయితీపై..

జిల్లాలోని అనంతపురం సమీపంలో, ఎంపీ డ్యాం మత్స్యక్షేత్రాల్లో చేపల ద్వారా గుడ్లు పెట్టించి విత్తన చేప తయారీకి చర్యలు చేపడతారు. ముఖ్యంగా మార్కెట్లో మంచి డిమాండ్ కలిగిన రోహు, బంగారు తీగ, కట్ల, మృగ్యాల రకాలను పెంచనున్నారు. అనంతపురం సమీపంలో 3 కోట్లు, ఎంపీ డ్యాం వద్ద 5 కోట్లు మొత్తం 8 కోట్ల చేప పిల్లలు ఉత్పత్తి చేసేలా లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇక్కడి నుంచి మూడు రోజుల వయసు కలిగిన (స్పాన్) చేప పిల్లలను బీటీపీ, పీఏబీఆర్ వద్ద ఉన్న మత్స్య క్షేత్రాల్లో పెంపకానికి తరలిస్తారు. ఈ ఏడాది బీటీపీ వద్ద 35 లక్షలు, పీఏబీఆర్ వద్ద 1.05 కోట్లు తొట్టెల్లో వదిలేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మత్స్య క్షేత్రాల్లో 3 నుంచి 4 నెలల పాటు పెంపకం చేపట్టి 80–100 ఎంఎం సైజు రాగానే రిజర్వాయర్లలోకి వదులుతారు. ఈ రెండు రిజర్వాయర్లకు పోనూ మిగిలిన వాటిని రాయలసీమలోని పలు రిజర్వాయర్లకు తరలించనున్నారు. జిల్లాలో లైసెన్స్ కలిగిన సొసైటీలు 60 ఉండగా, అందులో సుమారు 6,200 మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరికితోడు పరోక్షంగా మరో 10 వేల కుటుంబాలు చేపల అమ్మకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. మత్స్య సంఘాలకు 50 శాతం రాయితీతో అందించే విత్తన చేపకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది.

కార్యాచరణ లేకపోవడంపై ఆందోళన..

చేప విత్తనోత్పత్తికి జూన్ ఆరంభం నుంచి ఆగస్టు 15 అనువైన కాలం. పొదుగు (హేచింగ్), చిచ్చురు పిల్లలను సాకడం (రేరింగ్) కోసం నర్సరీలను సిద్ధం చేసుకోవడం అవసరం. అయితే మత్స్యశాఖ అధికారులు లెక్కలేసుకోవడం తప్ప కార్యాచరణ చేపట్టకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. హెచ్చెల్సీ నీటికి ఎదురుచూడటం కన్నా మత్స్య క్షేత్రాల్లో అందుబాటులో ఉండే బోరు నీటితో పెంపకం మొదలు పెడితే సరిపోతుందని పలువురు అంటున్నారు. జూన్ సగం గడిచిపోయినా విత్తన చేప కానరాని నేపథ్యంలో డ్యాంలలో చేపలు ఎప్పుడు విడుదల చేస్తారో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **నీరు రాగానే పెంపకం**
>
> అనంతపురం, ఎంపీ డ్యాం మత్స్యక్షేత్రాల్లో 8 కోట్ల చేప పిల్లల ఉత్పత్తికి చర్యలు చేపట్టాం. హెచ్చెల్సీ కాలువ ద్వారా నీరు వచ్చాకే ఈ ప్రక్రియ ప్రారంభిస్తాం. ఆ నీరు ఆలస్యమైతే ఈ నెలాఖరు నాటికి అందుబాటులో ఉండే బోరు నీటితో ఉత్పత్తి ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేస్తాం. లైసెన్స్ రిజర్వాయర్లకు ఇబ్బంది లేకుండా చేపలు విడుదల చేస్తాం. శింగనమల, జీడిపల్లి తదితర చెరువుల్లో నీరు చేరితే లైసెన్స్‌దారులే కొనుగోలు చేసి పెంచుకుంటారు. ఈ ఏడాది లక్ష్యానికి మించి చేపలు పెంచాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
>
> – శ్రీనివాసనాయక్, మత్స్యశాఖ డీడీ, అనంతపురం

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణోత్సవం

కదిరి టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీఖాద్రీశుని కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కదిరి నరసింహస్వామి ఆలయంలోని కల్యాణమండపంలో ఆదివారం అర్చకులు సంతోష్‌కుమార్ స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సస్పెన్షన్లు ఎత్తివేయాలి

- నగంలో ఆగిన 'నాడు–నేడు' పనులు పూర్తి చేయాలి
- పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘనల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సస్పెన్షన్ వేటు పడిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై వెంటనే సస్పెన్షన్ ఎత్తి వేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు మంచి జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని శాఖల్లో ఇప్పటికే సస్పెన్షన్లు ఎత్తివేసినట్లు గుర్తు చేశారు. మిగిలిన శాఖల్లోనూ అదే తరహాలో చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఇచ్చేలా చూడాలన్నారు. అర్హులైన టీచర్లు, లెక్చరర్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సగంలో ఆగిపోయిన 'నాడు–నేడు' పనులు పూర్తి చేసి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు సొసైటీల ద్వారా పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుని తల్లిదండ్రులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లే, జూనియర్ లెక్చరర్లు, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీల్లో చాలాకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా చూడాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలన్నారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు మోక్షిత్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ

కేంద్రాల వారీగా హాజరు ఇలా					
కేంద్రం	అభ్యర్థులు	పేపర్-1 హాజరు	శాతం	పేపర్-2 హాజరు	శాతం
జేఎన్‌టీయూ సెంటర్-1	576	314	54.5	311	54
జేఎన్‌టీయూ సెంటర్-2	480	266	55.4	262	54.58
కేఎస్ఎన్ పీజీ కళాశాల	469	253	53.09	256	54.6
ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల	384	191	49.73	192	50
ఆర్ట్స్ కళాశాల	398	216	54.28	214	53.76
ఎస్కేయూ	480	219	45.62	218	45.41
ఎస్ఎస్‌బీఎన్ జూ.కళాశాల	8	3	37.5	3	37.5
మొత్తం	2,795	1,462	52.3	1,456	52.09



ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్



జవాబుపత్రాల బుకింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్



ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగింది. ఏడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు అభ్యర్థుల హాజరు 52.19 శాతంగా నమోదైంది. మొత్తం 2,795 మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 1,462 మంది (52.30 శాతం) హాజరయ్యారు. 1,333 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్–2 పరీక్షకు 1,456 మంది (52.09 శాతం) హాజరుకాగా 1,339 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సందర్శించారు. పరీక్షల నిర్వహణను యూపీఎస్సీ (న్యూఢిల్లీ) సెక్షన్ ఆఫీసర్ హిమాంశు కుమార్ పర్యవేక్షించారు.

బుకింగ్ పక్కాగా చేపట్టాలి..

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. అనంతరం టవర్‌క్లాక్ సమీపంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం సందర్శించి సివిల్స్ పరీక్ష జవాబుపత్రాల బుకింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. బుకింగ్ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమాధికారి రామసుబ్బారెడ్డి, జిల్లా భూగర్భజల శాఖ డీడీ తిప్పేస్వామి, హెడ్ పోస్ట్ మాస్టర్ బాలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక





ప్రొఫెసర్లు చిత్ర, ఈశ్వరరెడ్డి

అనంతపురం: ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) అందించే అవార్డులకు జేఎన్‌టీయూ (ఏ)కు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వరరెడ్డి (అన్నా యూనివర్సిటీ నేషనల్ అవార్డు ఫర్ ది అవుట్ స్టాండింగ్ అకాడమీ టీచర్ కేటగిరీ) తో పాటు ఇంగ్లిష్ ప్రొఫెసర్ వీబీ చిత్ర అవార్డులకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈనెల 22న ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఐఎస్‌టీఈ యాన్యువల్ నేషనల్ ఫ్యాకల్టీ కన్వెన్షన్, కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకుంటారని తెలిపారు. జాతీయ పురస్కారాలకు ఎంపికైన ప్రొఫెసర్లను వీసీ శ్రీనివాసరావుతో పాటు రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ అభినందించారు.

క్లుప్తంగా

వలంటీర్ కుటుంబంపై టీడీపీ నాయకుల దాడి


గాయపడిన పాతూరప్ప

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని హులికల్లు గ్రామ వలంటీర్ కుటుంబంపై ఆదివారం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేశారు. వివరాలు... హులికల్లు గ్రామానికి చెందిన మహేష్ గత ప్రభుత్వంలో ఆ గ్రామ వలంటీర్‌గా విశేష సేవలు అందించాడు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వలంటీర్‌పై కక్ష పెంచుకున్న టీడీపీ నాయకులు గత వారం రోజులుగా మహేష్ ఎక్కడ కనిపించినా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వచ్చారు. తీవ్ర పదజాలంతో తిట్టేవారు. దుర్భాషలాడేవారు. అయినా మహేష్ మౌనంగానే వారి దుశ్చర్యను భరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం టీడీపీ నాయకులు రామాంజనేయులు, అంజి, నగేష్, శేఖర్, మారెక్క, లక్ష్మి... మహేష్ ఇంట్లోకి చొరబడి వలంటీర్ తండ్రి పాతూరప్ప, తమ్ముడు భరత్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేసి వెళ్లారు. గాయపడిన పాతూరప్ప, భరత్ కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఘటనకు సంబంధించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త

తాడిపత్రి అర్బన్: అనుమానం పెనుభూతమై.. భర్తే కాలయముడయ్యాడు. భార్య గొంతును అతి కిరాతకంగా కోశాడు. ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని టైలర్స్ కాలనీకి చెందిన రమీజాను ఐదు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన కార్పెంటర్ దాదాపీర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఇంట్లోనే బీడీలు చుడుతూ భర్త సంపాదనకు చేదోడుగా రమీజా నిలిచింది. దాదాపీర్ పనిపై బయటకు వెళ్లాల్సిన ప్రతి సారీ తన భార్య రమీజాను టైలర్స్‌కాలనీని పుట్టింట్లో వదిలి, తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు పిలుచుకెళ్లేవాడు. కొంత కాలంగా రమీజా తరచూ ఫోన్లో ఎక్కువ సమయం మాట్లాడుతుండడం గమనించిన దాదాపీర్ మందలించాడు. అయినా ఆమె పట్టించుకోలేదు. ఆదివారం ఉదయం ఇదే విషయంపై దంపతులు గొడవపడ్డారు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన దాదాపీర్ కత్తి తీసుకుని రమీజా గొంతు కోసి పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న రమీజాను గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను అనంతపురానికి తరలించారు. రమీజా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి పోలీసులు తెలిపారు.

అంతర పంటలు అన్నివిధాలా మేలు

- వాలుకు అడ్డంగా దున్ని విత్తుకుంటే తేమశాతం పెరుగుదల
- విత్తనశుద్ధి, మొక్కల సాంద్రత, కలుపు నివారణతోనే లాభసాటి
- తెగుళ్ల నివారణకు వేరుశనగ, పత్తి చుట్టూ రక్షణ పంటలు వేయాలి
- ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, జి.నారాయణస్వామి వెల్లడి


డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి


వేరుశనగ


ఆముదం

అనంతపురం అగ్రికల్చర్: వర్షాధారంగా కేవలం ఒకట్రెండు పంటలను నమ్ముకోకుండా మధ్యమధ్యలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలకు చెందిన అంతర పంటలు వేసుకోవడం వల్ల మెట్ట వ్యవసాయం లాభసాటి అవుతుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. విస్తారంగా వర్షాలు నమోదైన నేపథ్యంలో ఖరీఫ్ పంటలు విత్తుకునేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

- తేలికపాటి నేలల్లో వాలుకు అడ్డంగా దుక్కి చేసుకుని తర్వాత పంటలు విత్తుకుంటే నేలతో తేమశాతం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. వర్షాధారంగా అంతర పంటలు తప్పనిసరిగా వేయాలి. ఆరుతడి పంటలకు బోదే లేదా సాళ్ల లేదా ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవాలి. ఒకవేళ ఎక్కువ వర్షాలు వచ్చినా నీటిని బయటకు పంపడానికి అవకాశం ఉంటుంది. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టడానికి వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర విత్తనాలను తెగుళ్ల మందుతో విత్తనశుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్) చేసుకోవాలి. పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ దగ్గరదగ్గరగా ఒత్తుగా లేకుండా ప్రతి పంటలోనూ మొక్కల సాంద్రత పాటించాలి.
- వేరుశనగ సాగు చేసే రైతులు పొలాన్ని రెండు మూడు సార్లు దుక్కి చేసుకోవాలి. జూలై మాసం అంతా విత్తుకునేందుకు అనుకూలం. కే-6, కే-9, కదిరి హరితాంధ్ర, అనంత, ధరణి, కదిరి-లేపాక్షి, టీసీజీఎస్-1694 లాంటి విత్తన రకాలు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 నుంచి 60 కిలోలు విత్తనం అవసరం. విత్తే ముందు కిలో విత్తనానికి 1 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేసిన తర్వాత ఒక గ్రాము టెబుకొనజోల్ అలాగే 10 గ్రాము ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి పాటించాలి. వేరుశనగ పొలం చుట్టూ రక్షణ పంటలుగా సజ్జ, జొన్న నాలుగు నుంచి ఆరు వరసలు విత్తుకుంటే కాండం కుళ్లు, వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసంపీల్చు పురుగులు, తామరపురుగులను నివారించవచ్చు. 7 : 1 లేదా 11 : 1 లేదా 15 : 1 నిష్పత్తిలో వేరుశనగలో కంది లేదా సజ్జ పంటలు వేసుకోవాలి. విత్తే సమయం లేదా విత్తిన తర్వాత 20 నుంచి 30 రోజుల సమయంలో నీటి సంరక్షణ కోసం ప్రతి 3.6 మీటర్లకు ఒక తల్లిచాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కంది సాగు చేసే రైతులు తేలికపాటి నేలల్లో మధ్యస్థ రకాలైన పీఆర్‌జీ-176, పీఆర్‌జీ-158, ఐసీపీఎల్-84031 విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. బరువు నేలల్లో ఎక్కువ కాలపరిమితి రకాలైన ఎల్ఆర్‌జీ-41, ఎల్ఆర్‌జీ-52, , ఎల్ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59, ఐసీపీఎల్-85063, ఐసీపీఎల్-87119, బీఎస్ఎంఆర్ -786 రకాలు ఎంపిక చేసుకోవాలి.
- పత్తి విషయానికి వస్తే... ఎర్రనేలల్లో జూన్ నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు. నల్లరేగడి భూముల్లో జూలై నుంచి ఆగస్టు 15 వరకు విత్తుకునేందుకు అనుకూలం. ఒక ప్రాంతంలో ఉన్న రైతులంతా దఫాలుగా కాకుండా వీలైతే స్వల్ప వ్యవధిలో ఒకేసారి విత్తుకుంటే తెగుళ్ల, చీడపీడల నివారణకు సులభమవుతుంది. బీటీ రకం విత్తనాలు ఎకరాకు 750 గ్రాములు నుంచి ఒక కిలో అవసరం. బీటీ రకం వేసుకుంటే పొలం చుట్టూ నాన్ బీటీ పత్తి లేదా కంది వేసుకుంటే కాయతొలచు పురుగు ఉధృతిని అరికట్టవచ్చు. విత్తుకున్న 40 రోజులకు తప్పనిసరిగా ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వేసుకున్న ప్రాంతాల్లో పత్తి పంట ప్రస్తుతం మొలకదశలో ఉంది. ఈ వాతావరణానికి వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉన్నందున 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి మొక్క వేరుమండలం తడిచేలా పోయాలి. ఈ సమస్య నివారణకు విత్తే సమయంలో కిలో విత్తనానికి 10 గ్రాములు ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ఆముదం పంట విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై 31 వరకు అనుకూలం. హరిత, కిరణ్, జ్వాల, ప్రగతి లాంటి సూటి రకాలు అలాగే డీసీహెచ్-117, పీసీహెచ్-111, జీసీహెచ్-8, ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 లాంటి హైబ్రిడ్ విత్తన రకాలు అనువుగా ఉంటాయి.
- వరి నారు మడులు పెంచుకునేందుకు జూన్ 15 నుంచి జూన్ 30 వరకు అనుకూలం. సాంబమసూరి, నంద్యాల సన్నాలు, నెల్లూరు సోనా, నెల్లూరి మసూరి, నంద్యాల సోనా, ఎంటీయూ-1212, ఎంటీయూ-1280, ఎంటీయూ-1281 లాంటి రకాలు బాగుంటాయి. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు నారుపోసే ముందు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

కారు ఢీకొని వాహనదారుడు మృతి

- మరో ఐదుగురికి గాయాలు


మృతి చెందిన రమణారెడ్డి

గుత్తి రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి గ్రామానికి చెందిన రమణారెడ్డి తన కుటుంబం, చెల్లెలు కుటుంబంతో కలసి గుత్తి సమీపంలోని బాట సుంకులమ్మ ఆలయం వద్ద ఆదివారం జాతర చేసుకున్నారు. అనంతరం తన కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి, సోదరి కుమారుడు నరసింహారెడ్డితో కలసి ద్విచక్ర వాహనంపై పామిడికి బయలుదేరాడు. ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుంటుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు ఎగిరి కారుపై పడ్డారు. తీవ్ర రక్తగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన చైతన్య, నిహల్య, చందన సైతం గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా రమణారెడ్డిని ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మిగిలిన వారిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

జీఓ 117 రద్దు చేయాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో విద్యారంగానికి ఇబ్బంది కలిగించేలా ఉన్న జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల విలీనం రద్దు చేయడం ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ అమలులో జాప్యం చేసుకుంటున్న నేపథ్యంలో వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ప్రత్యామ్నాయంగా ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలన్నారు. రెండు మాధ్యమాల్లో విద్యా బోధన కొనసాగించాలన్నారు. రాష్ట్ర పూర్వాధ్యక్షులు ఎస్.రఘురామిరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు డి. ప్రభాకర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఆగిపోయిన తెలుగు, హిందీ, ఉర్దూ పాఠశాల సహాయకుల ప్రమోషన్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లాలో ఆగిపోయిన ఆంగ్లభాష సహాయకుల ప్రమోషన్లు తక్షణమే చేపట్టాలన్నారు. మానసిక వేదనకు గురిచేస్తూ ఎలాంటి ప్రయోజనం లేని అనేక యాప్‌ల భారాన్ని తగ్గించి ఉపాధ్యాయులకు మానసిక ఒత్తిడి లేని పని విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా పూర్వ కార్యదర్శి బి. హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి నాగరాజు, డేనియల్, గాయత్రి, బొమ్మయ్య, భాస్కర్, సతీష్, సరేష్, సర్దార్ వలి, రమణ, తిప్పేస్వామి, పాతిరెడ్డి పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్యం చేపట్టండి


మామిడిలో కత్తిరింపులు చేస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడిలో కాయ కోతలు దాదాపు పూర్తయినట్లు రెండు జిల్లాల ఉద్యానశాఖ డీడీలు జి.చంద్రశేఖర్, జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. కోతల తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల పైనే వచ్చే ఏడాది పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయన్నారు. ఈ క్రమంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు.

- తోటలో మామిడి కాయలు పూర్తిగా కోసిన తర్వాత ఒకసారి నీటి తడి ఇవ్వాలి.
- ఎండుపుల్లలు, పూతకాడలు, ఆకుగూళ్లు లాంటివి ఏరివేయాలి.
- చెట్ల మధ్య భాగంలో చిన్నపాటి కొమ్మలు తొలగించి సూర్యరశ్మి బాగా ప్రసరించేలా చేయాలి.
- బాగా ముదిరిన చెట్లలో అధికంగా పెరిగిన కొమ్మలను రంపం లేదా పవర్‌సాతో కత్తిరించాలి.
- చెట్ల ఎత్తును బాగా తగ్గించాలి.
- తొలగించిన కొమ్మల చివర కాపర్ సంబంధిత శిలీంధ్రనాశిని లేదా బావిస్టన్‌ను పూయాలి.
- తొలకరి సమయంలో చెట్ల మొదళ్ల వద్ద భూమిని దున్నాలి. లేకుంటే పాదులను తవ్వి తిరగేయాలి.
- జూన్, జూలైలో ఎకారకు 10 కిలోల జీలుగ లేదా 25 కిలోల జనుము లాంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లి 45 నుంచి 50 రోజుల తర్వాత బాగా కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- ప్రతి చెట్టు పాదులో 100 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు లేదా 10 కిలోల వర్మీ కంపోస్టు వేయాలి.
- సిఫారసు చేసిన మోతాదులో ఒక్కో చెట్టుకు 1.7 కిలోల యూరియా, 1.1 కిలోల సింగిల్‌సూపర్‌పాస్ఫేట్, 1.15 కిలోల పొటాషియం సల్ఫేట్ వేయాలి.
- జూన్-జూలై అలాగే అక్టోబర్-నవంబర్‌లో సంవత్సరానికి రెండు సార్లు పైన తెలిపిన విధంగా రసాయన ఎరువులు వేయాలి.
- కొత్త చిగుర్లు వచ్చే సమయంలో ఒక్కో చెట్టుకు 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల బోరాక్స్, 10 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పిందె కట్టడానికి వీలుగా పూత వచ్చే ముందు మొదటి దశలో పిచికారీ చేసే మందులలో 2 గ్రాముల బోరాక్స్ (సొల్యూబార్) లీటర్ నీటికి కలుపుకుంటే ఫలితాలు బాగుంటాయి.

చికెన్ పాయా ఇవ్వలేదని హత్య

- గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించిన పోలీసులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం (డి.హీరేహాళ్): చికెన్ పాయా (చారు) ఇవ్వలేదన్న అక్కసుతో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... డి.హీరేహాల్ మండలం మురడిలో నివాసముంటున్న మురడప్ప (55)కు భార్య, బిడ్డలు ఎవరూ లేరు. అనాథగా ఉంటూ చుట్టుపక్కల ఇళ్లలో పనులతో పాటు ఆంజనేయస్వామి ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కావడంతో స్థానిక చికెన్ దుకాణం నిర్వాహకుడు ఉచితంగా ఇచ్చిన కోడి కాళ్లను తీసుకెళ్లి ఓ వంకలో సొంతంగా రసం (పాయా) కాచి భోజనానికి సిద్ధమయ్యాడు. అదే సమయంలో అక్కడకు చేరుకుని స్థానిక యువకుడు ఏసురాజు.. తనకూ చికెన్ రసం ఇవ్వాలని అడిగాడు. తాను చేసుకున్న రసంలోనే కొంచెం ఇచ్చినా ఏసురాజు ఒప్పుకోలేదు. మరికాస్త కావాలంటూ దౌర్జన్యం చేశాడు. దీంతో మురడప్ప తిరగబడ్డాడు. అదే సమయంలో చేతికి అందుబాటులో ఉన్న బండరాయిని ఏసురాజు తీసుకుని మురడప్ప తలపై మోది హతమార్చి గుట్టుచప్పుడు కాకుండా గ్రామంలోకి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత అటుగా వెళ్లిన వారు మురడప్ప మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. నిందితుడిని గంటల వ్యవధిలోనే గుర్తించారు. అప్పటికే ఏసురాజు అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటకలో 'దుర్గం' వాసి మృతి

రాయదుర్గం టౌన్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు... రాయదుర్గంలోని మారెమ్మ గుడి ప్రాంతానికి చెందిన వెంకటేశులు (30) శనివారం రాత్రి నేసేపేటకు చెందిన స్నేహితుడు విజయ్‌కుమార్‌తో కలసి ద్విచక్ర వాహనంపై కర్ణాటకలోని మొలకాల్మూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మొలకాల్మూరులోని ఫైర్ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోయి ప్రధాన రహదారిపై కిందపడ్డారు. గాయపడిన ఇద్దరినీ స్థానికులు గమనించి వెంటనే మొలకాల్మూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటేశులు మృతి చెందాడు. విజయ్‌కుమార్‌ను అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై మొలకాల్మూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'అనంత'కు చేరుకున్న కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

- స్వాగతం పలికిన అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ విద్యార్థులు



ఆర్మీ అధికారులతో ఎన్‌సీసీ విద్యార్థులు

అనంతపురం అర్బన్: కార్గిల్ విజయ్ దివస్ ఆర్మీ బైక్ యాత్ర ఆదివారం అనంతపురం చేరుకుంది. నీలం సంజీవరెడ్డి స్టేడియం వద్ద జిల్లా యంత్రాంగం తరఫున అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, టౌన్ డీఎస్పీ ప్రతాప్‌కుమార్, మాజీ సైనికులు, ఎన్‌సీసీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా నుంచి కార్గిల్ ప్రాంతంలో విధులు నిర్వహించిన మాజీ సైనికులకు లెఫ్టినెంట్ కల్నల్ మనోజ్ కుమార్ నాయర్, కెప్టెన్ ఆదర్శ్ జన్మేదా కార్గిల్ విజయ్ దివస్ బ్యాడ్జీలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్, అధికారులు మాట్లాడారు. కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆర్మీ ఆర్టిలరీ విభాగం డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ ప్రాంత యాత్ర ధనుష్కోటి నుంచి బెంగుళూరు మీదుగా ఆదివారం సాయంత్రం అనంతపురం చేరుకున్నట్లు తెలిపారు. కార్గిల్ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం నలుమూలలా యువత, మాజీ సైనికులు, ప్రజల్లో దేశభక్తి, కార్గిల్ వీరుల స్ఫూర్తిని నింపడానికి ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో జయంతి మహోత్సవ్ డి-5 మోటార్ సైకిల యాత్ర చేపట్టినట్లు తెలిపారు. జూలై 26న జమ్మూ కాశ్మీర్‌లో ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకోవడంతో ర్యాలీ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు విశ్వేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్దప్ప, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది గిరీష్, బాబా, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే శిలాఫలకం ధ్వంసం


శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపుల గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని ఆదివారం పట్టపగలే టీడీపీ కార్యకర్తలు గొల్ల నాగరాజు, చాకలి మారుతి ధ్వంసం చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాలేదు. విషయం తెలుసుకున్న గొల్ల నాగరాజు, మారుతి అక్కడకు చేరుకుని శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఘటనపై పోలీసులకు ఆర్‌బీకే ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

కంబదూరులో సచివాలయంపై...


ధ్వంసమైన శిలాఫలకం

కంబదూరు: స్థానిక సచివాలయం-1పై ఆదివారం రాత్రి కొందరు టీడీపీ నాయకులు దాడి చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలున్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో దుశ్చర్యను గమనించిన అక్కడే ఉన్న ఓ వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో టీడీపీ నాయకులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

ఆత్మరాముడిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు


ఆలయంలో కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు

శింగనమల: స్థానిక పురాతనమైన ఆత్మరామాలయాన్ని ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు, ఈఓ బాబు , రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఓబిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

వెంకటాద్రిపల్లిలో సందడిగా సినిమా షూటింగ్


సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న కెమెరామెన్

బెళుగుప్ప: మండలంలోని వెంకటాద్రిపల్లి వీధుల్లో ఆదివారం సినిమా షూటింగ్ సందడిగా సాగింది. హీరో ఆది పినిశెట్టిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. దాదాపు మూడు నాలుగు దశాబ్దాల క్రితం రాజకీయాలకు సంబంధించిన గ్రామీణ వాతావరణంపై చిత్ర నిర్మాణం కొనసాగుతున్నట్లు దర్శకుడు దేవాకట్టా తెలిపారు. వెంకటాద్రిపల్లిలో ఎన్నికల ప్రచార ఘట్టం, కొన్ని ఫైట్ సన్నివేశాలను చిత్రీకరించారు.

'గురు బ్రహ్మ' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న గురువుల కృషిని గుర్తిస్తూ వారికి గురు బ్రహ్మ, గురు శిరోమణి పురస్కారాల నందిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం విద్యారంగమే కాకుండా వివిధ రంగాలలో గురువులుగా రాణిస్తున్న వారు అర్హులు. ఆసక్తి గల వారు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులను 'సర్వే జనా సుఖినో భవంతు, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు చేరేలా పంపాలి. ఎంపికైన వారికి గురువులకు వందనం పేరుతో జూన్ 14న ఆదివారం హైదరాబాదులో ఉన్నతాధికారుల చేతుల మీదుగా పురస్కారాలను అందిస్తారు. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

జీవాల్లో నట్టల నివారణ చర్యలు చేపట్టండి

బుక్కరాయసముద్రం: గొర్రెల్లో నట్టల నివారణకు చర్యలు చేపట్టాలని కాపరులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వెటర్నరీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి సూచించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులకు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకం కూడా ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. బయలు ప్రదేశాల్లోని గడ్డిని మేసినప్పుడు వాటిపై లార్వా దశలో ఉన్న ఏలిక పాములు, జలగలు, బద్దె పురుగులు గొర్రెలు, మేకల శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. దీని ప్రభావం కారణంగా విరేచనాలు, రక్త హీనతతో జీవాలు బాధపడతాయన్నారు. జలగలు ఉంటే దవడ కింద వాపు వస్తుందన్నారు. సకాలంలో గుర్తించి నట్టల మందు తాగించడం ద్వారా ప్రమాదం నుంచి జీవాలను కాపాడుకోవచ్చున్నారు. ఈ మందు తాగిస్తే గొర్రె పిల్లల ఎదుగుదల బాగుంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.

క్లుప్తంగా

ఇసుక టిప్పర్ పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం గార్లదిన్నె పోలీసులు పట్టుకున్నారు. శింగనమల మండలం ఉల్లికల్లు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుక లోలూరుకు తరలిస్తుండగా తలగాచిపల్లి వద్ద టిప్పర్‌ను ఆపి పోలీసులు రికార్డులు పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోతలయ్య స్వామికి పూజలు



అలంకరణలో పోతలయ్య స్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్య స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆముదం సాగుపై ఆసక్తి



ఆముదం విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

ఆత్మకూరు: ఇటీవల విస్తృతంగా కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసేందుకు రైతులకు పదును లభించింది. ఇప్పటికే పొలాల్లో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 12 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆముదం, కంది పంటల సాగుకు రైతన్నలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మరికొంత మంది రైతులు వేరుశనగ విత్తడానికి పొలాలను చదును చేసుకుంటున్నారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా 5 వేల ఎకరాలకు పైగా ఆముదం, 4 వేల ఎకరాల వరకూ కంది పంట సాగయ్యే అవకాశం ఉంది.

అభివృద్ధిలో పోటీతత్వం ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా

పెద్దపప్పూరు: ఆధిపత్యం కోసం పాకులాడితే జీవితాలు దెబ్బతింటాయని, అదే తోటివారి కన్నా బాగుండాలనే పోటీతత్వం ప్రతి ఒక్కరిలో ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా సూచించారు. ఆదివారం సమస్యాత్మక గ్రామం వరదాయపల్లిలో ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పిల్లల భవిష్యత్ పెద్దలపై ఆధారపడి ఉంటుందన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రవర్తన మార్చుకుంటే జీవితాలు మెరుగుపడతాయన్నారు.ఎటువంటి సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లి (సూరశింగన పల్లి)లో లోకేష్ అనే యువకుడు ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

గుంతకల్లు: పట్టణంలోని నిజాం కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభను చాటారు. అండర్-16 ఓపెన్ స్కూల్ టోర్నీలో వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 31 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో యువరాజ్ కార్వా, రాఘవ, ఉదయ్, బాలాజీ, ఉపేంద్ర ప్రతిభ కనబరిచారు. వారికి ముఖ్యఅతిథి డాక్టర్ హిమబిందు జ్ఞాపికలను అందజేశారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

- వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు
- ప్రతి శని, ఆదివారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు



చిన్మయనగర్‌లో చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణులు నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరిచేరవు. జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. అయితే చాలా మంది, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేదు. దీంతో వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతన్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్ వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు తర్వాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, పోలిక్, కాల్షియం ట్యాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ అందజేస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోసు వేయించాలి. వీటితో పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు ఆరు, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు టీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెటనస్ టెక్సాయిడ్ (టీటీ) వేయించాలి.
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒక సారి విటమిన్–ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

– శివకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాప్తాడు

బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

అనంతపురం కల్చరల్/అనంతపురం కార్పొరేషన్: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీదు పండుగను పురస్కరించుకుని నగరంలోని మసీదులు సామూహిక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ప్రార్థన మందిరాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతోంది. నగరంలోని పలు మసీదుల్లో వేర్వేరు సమయాలలో ప్రార్థనలు జరగనున్నాయి. హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న ఈద్గా మైదానంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. అదే విధంగా సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదులో 6:15 గంటలకు, ఎంజీ కాలనీలోని మదీనా మసీదులో 6:35 గంటలకు, అరవింద నగర్ మమూర్ మసీదులో 7 గంటలకు, సిండికేట్ నగర్‌లోని ఈద్గా మసీదులో 7:30 గంటలకు, డ్రైవర్స్ కాలనీలోని నూరానీ మసీదులో 7:30 గంటలకు, గుల్జార్‌పేట్‌లోని ఆయేషా మసీదులో 8 గంటలకు, స్థానిక పీటీసీ ఎదురుగా ఉన్న చాందినీ మసీదులో 8:30 గంటలకు, హెచ్చెల్సీ కాలనీలోని ఈద్గా మైదానంలో 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుందాం: మేయర్ వసీం

త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగను కుల మతాలకు అతీతంగా జరుపుకుందామని మేయర్ వసీం సలీం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈద్గా మైదానంలోనే కాకుండా పలు మసీదుల వద్ద పారిశుధ్య పనులను వేగవంతం చేశామని తెలిపారు. అన్ని మతాల వారు సామరస్యంతో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకునే బక్రీద్ పండుగ అందరికి సంతోషాలను తెస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

శ్రీనివాసుడికి 108 కేజీల చక్కెరతో అభిషేకం



చక్కెరతో అభిషేకం చేస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న మహిళలు

- మార్మోగిన విష్ణుసహస్రనామం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం విష్ణు సహస్రనామంతో ప్రతిధ్వనించింది. భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమైన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు వేడుకల్లో లక్ష్మీ సమేత శ్రీనివాసుడికి విష్ణు సహస్రనామ పారాయణ మండలి వారు వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో కలిసి 108 కేజీల చక్కెరతో అభిషేం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారి చక్కెర నైవేద్యాన్ని ప్రసాదంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు హరికిషోర్ శర్మ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 17 పర్యాయాలు విష్ణు సహస్రనామ పారాయణం ఆలయంలో జరిగిందన్నారు. ముగింపు ఉత్సవంలో శ్రీవారికి విశేష చక్కెరతో అభిషేకం, సామూహిక అర్చనలు, ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకార సేవలు జరిగాయని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా ఆలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ మండలి ప్రతినిధులు మేడా వేంకటేశ్వరులు, శ్రీరామమూర్తి, రమేష్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ గాయత్రీ హోమం



హోమం చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: వేదమాత గాయత్రీ దేవి జయంతిని పురస్కరించుకుని స్థానిక అశోక్ నగర్‌లోని హరిహరదేవాలయంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గాయత్రీ హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మూడు వందల మంది భక్తులు వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద పవిత్ర గాయత్రీ దేవి మంత్రం జపిస్తూ నెయ్యితో హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. విజయతారక మంత్రంగా భాసిల్లుతున్న గాయత్రి మంత్రాన్ని విశ్వామిత్రుడు లోకానికి అందించాడని లోకకల్యాణం ఆ పవిత్ర మంత్రంతోనే ప్రాప్తిస్తుందన్నారు. అందరూ సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశంతో 12 గంటల అఖండ గాయత్రి హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా మండలి సభ్యులు, కోలాట బృందం వారు భక్తి గీతాలతో అమ్మవారికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అంబటి ఫణిరాజ్, శ్రీధర్, సందీప్, విజయ్‌కుమార్, కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేస్తమా.. కుశలమా



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలోని ఉన్న సదానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి తీపి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువుల సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు అనంత పద్మనాభం, ఉపాధ్యాయులు అశ్వర్థనారాయణ, శర్మ తదితరులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీదేవి, కిష్టప్ప, రవి, జయప్ప, చంద్ర, సులోచన, రాజశేఖర్, తిరుపాల్, కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాత్విక చింతనకు ప్రతిరూపం 'ఆకాశగానం'



ఆకాశగానం నవలను ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి నవ యువకుడిగా ఉన్నప్పుడు చేసిన రచన తాత్విక చింతనతో అద్భుతంగా వచ్చిందని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, మధుర కవి మల్లెల నరసింహమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో బండి నారాయస్వామి రచించిన ఆకాశగానం నవలావిష్కరణ జరిగింది. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ కార్యక్రమానికి మల్లెల నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. అన్వీక్షికి ప్రచురణ కర్త మహి బెజవాడ పుస్తక సమీక్షకుడిగా గుంటూరు లక్ష్మీ నరసయ్య ఆత్మీయ అతిథులుగా విచ్చేసి బండి నారాయణస్వామి రచనా విశిష్టతను వివరించారు. నవలలోని అస్తిత్వవాద సిద్ధాంత రూపాలను ఆవిష్కరించిన తీరు ఎంతో గొప్ప ఉందని కొనియాడారు. ప్రాచ్య, పాశ్చాత్య తాత్విక చింతన రీతులు, నవలకు వాటితో గల సంబంధాలను విశ్లేషించారు. అదేవిధంగా జిరసం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జన్నే ఆనంద్, కొత్తపల్లి సురేష్, డాక్టర్ అంకే శ్రీనివాస్, ఉప్పరపాటి వెంకటేశులు, రాయుడు, డాక్టర్ భీమసేనాచార్ నవల గురించి అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, నబీరసూల్, షరీఫ్, రియాజుద్దీన్, చిలుకూరి దీవెన, టీవీరెడ్డి, వన్నప్ప, నాగేంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు మాఫీ చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: పంట దిగుబడులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని మండల రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం నాయకులు నాగరాజు, బాలరాజు, మల్లికార్జున రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు చాలా నష్టాల పాలవుతున్నారు. పంట పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో చేసిన పంట రుణాలు కూడా తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతుల రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలన్నారు. వీటితో పాటు రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి విశేష పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



పూజలందుకున్న మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామి మూలవిరాట్‌ను బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆకుపూజ అనంతరం స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

గార్లదిన్నె: ఖరీఫ్ సీజనల్‌లో రైతులు ఒకే రకమైన పంటలు సాగుచేయకుండా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పొలంలో భూసార పరీక్ష చేయించుకుని.. అందుకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. మేలైన దిగుబడులు పొందవచ్చునన్నారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలై 15 వరకూ వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా అర కొర పదును అయితే రైతులు ప్రత్యామ్నయ పంటలు కొర్ర, ఉలవలు, పెసర, అలసందులు, కంది వంటి పంటలు సాగు చేసుకవాలన్నారు.

నేలపై కూర్చోవాల్సిందేనా?



పసికందులతో నేలపై కూర్చున్న బాలింతల కుటుంబీకులు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లేబర్ వార్డులో దయనీయమైన పరిస్థితి నెలకొంది. అప్పుడే పుట్టిన రోజు పసికందులకు జీరో డోస్ పోలియో వ్యాక్సిన్ కోసం బాలింతలు, వారి సహాయకులు అవస్థలు పడాల్సి వస్తోంది. వ్యాక్సిన్ కోసం వెళ్లిన వారిని నేలపై కూర్చో పెట్టి వ్యాక్సిన్ వేస్తున్నారు. గతంలో వార్డులకు వెళ్లి వ్యాక్సిన్ వేసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు లేబర్ ఓటీ ముందు ఉన్న ఓ గదిలో పసికందులకు వ్యాక్సిన్ అందిస్తున్నారు. కనీసం బెంచీలైనా ఏర్పాటు చేస్తే బాగుంటుందని బాలింతల కుటుంబీకులు కోరుతున్నారు.

– అనంతపురం మెడికల్:

15 షాపులకు రూ.1,15,000 జరిమానా

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ప్లాస్టిక్ నిషేధం నిబంధనలు ఉల్లంఘించిన షాపులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి విరుద్ధంగా వినియోగం చేస్తున్న 15 షాపులకు నగరపాలక సంస్థ అధికారులు రూ.1,15,000 ఫైన్ వేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనెల 15న రాత్రి వరకు ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్, కమలానగర్, తదితర ప్రాంతాల్లో దాడులు చేశారు.

డ్యాన్స్‌లతో హోరెత్తించిన చిన్నారులు



పాటకు డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: గ్రామీణ ప్రాంతాల వారి జీవన శైలిని అనుకరిస్తూ చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో రామ్ డ్యాన్స్ అకాడమీ వారి వేసవి శిక్షణ ముగింపు వేడుకలు జరిగాయి. డ్యాన్స్ మాస్టర్లు రవికుమార్, రమణ నేతృత్వంలో చిన్నారులు భరతమాత, గ్రామదేవత రూపాలతో పల్లెల ప్రాధాన్యత తెలిపే ఆటపాటలతో అలరించారు. అలాగే జానపద, వెస్ట్రన్ డ్యాన్సులతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సీనియర్ చిత్రకారుడు, డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ అకాడమీల డ్యాన్స్ మాస్టర్లు చందు, విష్ణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఓ మహిళ మృతి చెందింది. మృతురాలిని అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన నాగరత్నమ్మ (55)గా గుర్తించినట్లు ధర్మవరం రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కాగా, పాఠశాలల వద్ద పండ్లు అమ్ముకుని జీవనం సాగించే నాగరత్నమ్మ మృతికి కారాణాలు తెలియాల్సి ఉంది.

ఆంజనేయుడికి పూజలు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేసినట్లు నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి తెలిపారు.

నేడు నీలకంఠేశ్వర స్వామికి..

రాప్తాడు: మండల కేంద్రంలోని స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు ఎర్రితాత ఆలయంలో..

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వెలసిన ఎర్రితాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి ఎర్రిస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నల్లలమ్మ ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 16వ తేదీ వరకూ భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554-246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.